

'స్మార్ట్ మీటర్ల'పై పోరు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 12.24 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ సర్వీసులన్నీ త్వరలో స్మార్ట్ మీటర్ల కిందకు రాబోతున్నాయి. స్మార్ట్ మీటర్లను అందించే వెసులు బాటును ఆదాని గ్రూప్ సంస్థకు ఇచ్చింది. విడతల వారీగా జిల్లాలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి విడతగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయగా రెండో విడతలో వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటి వరకూ లక్షకు పైగా స్మార్ట్ మీటర్లను బిగించారు. ఆ తరువాత మూడో విడతగా గృహాలకు ఈ స్మార్ట్ మీటర్లను పెట్టనున్నారు. ప్రస్తుతానికి స్మార్ట్ మీటర్లకు పోస్ట్‌పెయిడ్ విధానంలోనే బిల్లులు వసూలు చేస్తున్నారు. పలువురికి స్మార్ట్ మీటర్లు పెట్టిన తరువాత విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో స్మార్ట్ మీటరకు ప్రీపెయిడ్ విధానాన్ని అమలు చేయనున్నారు. నిత్యం వాడే సెల్ ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్ చేసుకోవడం మరిచిపోతే కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జ్ చేసుకుంటేనే కరెంట్ వస్తుంది. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోరు సాగుతోంది. స్మార్ట్ మీటర్ల వల్ల నష్టాలను, భారాలను తెలియజేస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

పరిష్కారం కాని రజకుల సమస్యలు : తాము అధికారంలోకి వస్తే వృత్తిదారులకు స్వయం ఉపాధి ద్వారా రూ.10 వేల కోట్లతో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఒక్క వృత్తిదారునికి కానీ, వారి కుటుంబంలో ఒక బిడ్డకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రజక వృత్తి దారులకు దోభీఘాట్ల నిర్మాణాలకు ప్రోత్సాహం, విద్యుత్‌లో రాయితీలు ఏమీ ఇవ్వలేదు. జిఒ 343 ప్రకారం చెరువుల్లో దోభీఘాట్ల స్థలాలపై పూర్తి హక్కు రజకులకే అన్న హామీ అమలు కాలేదు. జిఒ 27 ప్రకారం దోభీ పోస్టులు భర్తీ చేసి రజకులకు ఉపాధి కల్పిస్తామన్నారు. అదీలేదు. అన్ని వృత్తుల్లో ఉన్న వత్తిదారులకు ఆదరణ పథకం రూ.5 వేల కోట్లతో అధునాతనమైన పనిముట్లు ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టింది లేదు. అధునాతనమైన యంత్రాలు ఇచ్చింది లేదు. వత్తిదారుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి జిల్లాలో కలెక్టర్ కన్వీనర్‌గా రజక వత్తిదారుల సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి.. వారి అవసరాలు తెలుసుకుని ప్రభుత్వానికి తెలిపి వారికి రావాల్సిన నిధులు, వసతులు కల్పించాల్సి ఉంది. అదీ జరగడం లేదు.

సమ్మె సక్సెస్ : కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జిల్లాలో దేశవ్యాప్త సమ్మె సక్సెస్ అయింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లు రద్దు అయ్యేంతవరకు కార్మిక వర్గం పోరాడుతుందని ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బ్యాంకు, ఎల్ఐసి, పోస్టల్ ఉద్యోగ సంఘాలు పాల్గొన్నాయి. ఆటోలు కూడా బంద్ పాటించి సమ్మెకు సంఘీభావం తెలిపారు.

మెగా పిటిఎం : జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రజాప్రతినిధులు అధికారులు సహపంక్తి భోజనాలను చేశారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహించారు. పాఠశాల, కళాశాల ప్రాంగణంలో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు సంబంధించిన ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు అందజేశారు.



సమాజ మార్పులో యువశక్తి కీలకం

- ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న
- డివైఎఫ్ఐ జిల్లా 19వ మహాసభ ప్రారంభం



మహాసభలో మాట్లాడుతున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సమాజ మార్పు కోసం యువత శక్తి చాలా అవసరమని ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి. రామన్న పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో డివైఎఫ్ఐ జిల్లా 19వ మహాసభలు ఘనంగా జరిగాయి. మహాసభల ప్రారంభ సూచికగా జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర డివైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శంకర్ శర్మ, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రామన్న మాట్లాడారు. సమాజం మారాలంటే యువత శక్తి చాలా అవసరమని, ఆ శక్తిని డివైఎఫ్ఐ సరైన రీతిలో నడిపిస్తుందన్నారు. ఇప్పుడున్న కాలంలో రాజకీయ నాయకులు యువతను సమస్యల మీద ఆలోచించకుండా పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. డివైఎఫ్ఐ నిరుద్యోగ సమస్యపై, స్థానిక సంస్థలపై, సమాజంలో జరుగుతున్న వివక్షలకు వ్యతిరేకంగా యువతను ఐక్యం చేసి పోరాడేందుకు సిద్ధం చేస్తుందని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను ఆదుకోవడంలో విఫలం చెందాయన్నారు. కేంద్రంలో పది లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా యువత భవిష్యత్తుతో బిజెపి ప్రభుత్వం ఆటలాడుతుందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బిజెపి మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు లక్షల ఉద్యోగాలు ఊడగొట్టిందని విమర్శించారు. సంవత్సర కాలం పూర్తయినప్పటికీ నిరుద్యోగ భృతి అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా రాష్ట్రంలో అత్యంత వెనకబడిన జిల్లాగా వలసలతో నిత్యం కరువుతో ఉందన్నారు. కర్నూలు జిల్లాల్లో అత్యధిక మంది చదువుకున్న, చదువుకున్న యువత ఉపాధి, ఉద్యోగాలు లేక వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారి మెరుగైన భవిష్యత్తు కోసం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని, స్థానిక పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి, ప్రాజెక్టుల నిర్మాణానికి, పరిశ్రమల స్థాపన కోసం తీర్మానాలు చేయబోతున్నామని, భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. మహాసభలలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు వీరేష్, మైనా, హుస్సేన్ భాష, దాసు, సురేష్, శిరీష, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న


జెండావిష్కరణ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర

తుంగభద్ర నదిలో ముగ్గురు యువకులు గల్లంతు

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి - మంత్రాలయం


అజిత్ ప్రమోద్ సచిన్

కర్నూలు జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం సమీపంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో శనివారం ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని హాసన్ జిల్లాకు చెందిన 7 మంది యువకులు అజిత్, ప్రమోద్, సచిన్, రంగనాథ్, నారాయణ, దర్శన్, హేమంత్‌లు రాఘవేంద్రస్వామి దర్శనార్థమై శుక్రవారం రాత్రి మంత్రాలయం చేరుకున్నారు. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో తుంగభద్ర నదిలో స్నానానికి నలుగురు యువకులు అజిత్, ప్రమోద్, సచిన్, రంగనాథ్‌లు దిగారు. నీదిలో నీరు ఉదతంగా ప్రవహిస్తుండడంతో నలుగురు యువకులు నది లోపలికి కొట్టుకుపోయారు. యువవకులు కొట్టుకుపోతుండడం గమనించిన స్థానిక వ్యక్తి రంగనాథ్ అనే యువకుడి చేయి పట్టుకుని బయటకు తీసుకువచ్చాడు. మిగిలిన ముగ్గురు అజిత్, ప్రమోద్, సచిన్‌లు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. యువకులంతా డిగ్రీ చదువుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీమఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్, సెక్యూరిటీ సూపర్ వైజర్ మూర్తి, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గోనెగండ్ల సిఐ గంగాధర్, ఎస్ఐ నందవరం ఎస్సై కేశవ శివాంజల్, గ్రామ సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, నాయకుడు ప్రాణేష్‌లు నదిలో గజ ఈతగాళ్లతో పుట్టిలతో గాలింపు చర్యలు చేపట్టారు.


వివరాలు తెలుసుకుంటున్న శ్రీమఠం మేనేజర్ శ్రీనివాస రావు

సైన్స్ ద్వారానే సమాజాభివృద్ధి

- మతోన్మాదంతో ప్రజలను దారి మళ్లిస్తున్న పాలకులు - శాస్త్ర సాంకేతిక రంగం పట్ల చిన్నచూపు
- విజ్ఞాన చింతన పరిశోధకులు డాక్టర్ దేవరాజ్ మహారాజు



మాట్లాడుతున్న విజ్ఞాన చింతన పరిశోధకులు డాక్టర్ దేవరాజ్ మహారాజు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సైన్స్ ద్వారానే సమాజాభివృద్ధి జరుగుతుందని విజ్ఞాన చింతన పరిశోధకులు డాక్టర్ దేవరాజ్ మహారాజ్ అన్నారు. ప్రస్తుతం దేశంలో పాలకులు మతోన్మాదం పేరుతో ప్రజలను దారి మళ్ళిస్తున్నారని పేర్కొన్నారు. సైన్స్‌ను చిన్న చూపు చూస్తూ, మూఢ నమ్మకాలను ప్రజల్లో పెంపొందిస్తున్నా రన్నారు. శనివారం కర్నూల్ నగరంలోని బిఎఎస్ కళ్యాణ మండపంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'విద్యారంగం వైజ్ఞానిక దృక్పథం' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సుందరయ్య విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు ధనుంజయ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవరాజ్ మహారాజు మాట్లాడారు. దేశంలో గత 11 సంవత్సరాలుగా శాస్త్ర సాంకేతిక రంగాన్ని పాలకులు పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. ప్రతి ఏడాది యువ శాస్త్రవేత్తలకు అందజేసే అవార్డులను కూడా రద్దు చేశారని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఇస్రోలో జరిగే ప్రయోగాల వద్ద పూజలు కూడా నిర్వహించడం దుర్మార్గమన్నారు. దీనిని బట్టి చూస్తేనే సమాజం ఎటువైపు నడుస్తుందో అర్థమవుతుందన్నారు. ఇటీవల కాలంలో సనాతన ధర్మం పేరుతో ఊదరగొట్టు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. మతోన్మాద భావజాలంతో ప్రజలను విడగొట్టి అభివృద్ధి నిరోధకలుగా మారుతున్నారని విమర్శించారు. 2000 సంవత్సరాల క్రితమే దేశంలో సైన్సు భావజాలాన్ని గౌతమ బుద్ధుడు పెంపొందించారని చెప్పారు. ఆయన కాలంలో నిర్మించిన విశ్వవిద్యాలయాలను ధ్వంసం చేసి ప్రజలకు సైన్స్ ఫలాలు అందకుండా చేశారన్నారు. స్వాతంత్రం అనంతరం దేశంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు అప్పటి పాలకులు ఎనలేని కృషి చేశారని తెలిపారు. సోవియట్ రష్యా ద్వారా శాస్త్ర సాంకేతిక రంగానికి సంబంధించిన ప్రయోగాలు చేసేందుకు సహాయ సహకారాలు పొందారన్నారు. అయితే నేటి తరం పాలకులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రస్తుతం వైద్యరంగంలో కూడా అనేక మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఒక యుద్ధ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మతం వైపు, మూఢ నమ్మకాల వైపు ఆకర్షితులు కాకుండా సైన్సు పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించేందుకు నేటితరం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలను శాస్త్రీయ సమాజం వైపు నడిపించేందుకు ఇలాంటి వేదికలు మరింత సంసిద్ధం కావాలని కోరారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నాయకులు కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానాన్ని అవలంభించడంలో నేటి పాలకులు వైఫల్యం చెందుతున్నారన్నారు. చరిత్రను కూడా వక్రీకరిస్తున్నారని చెప్పారు. ఏ సమాజమైనా అభివృద్ధి చెందాలంటే అక్కడ శాస్త్రీయ విద్యా విధానం అయితే సాధ్యమవుతుందని, పురోగతివైపు వెళుతుందని పేర్కొన్నారు. మతోన్మాద పోకడలను ప్రతిఘటిస్తూ శాస్త్రీయ సమాజం వైపు పిల్లలను నడిపించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు జె.రఘుబాబు, కెంగార మోహన్, బీడీ సుధీర్ రాజు, టి.నరసింహ, బిఎల్ఎన్ ప్రసాద్ శర్మ, రవికుమార్, నవీన్ పాటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజశేఖర్

స్మార్ట్ మీటర్లపై పోరుబాట : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

స్మార్ట్ మీటర్లు మాకొద్దంటూ ఈనెల 14న విద్యుత్ సౌధ ముందు పోరుబాట నిర్వహిస్తున్నట్లు సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. శనివారం నగరంలోని బాపూజీ నగర్, కెఎన్ఆర్ గార్డెన్, ఎర్ర మసీద్ ప్రాంతంలో సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం శాఖ కార్యదర్శి బి.రాంబాబు అధ్యక్షతన ప్రచారం నిర్వహించారు. విద్యుత్ సౌధ ముట్టడికి అర్జీలు తీసుకొని అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వంపై నిరసన తెలియాలని కోరారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యులు డి.అబ్దుల్ దేశాయ్ మాట్లాడుతూ... ప్రభుత్వాలు మారినా పాలసీలు మారడం లేదని, వైసిపి ప్రభుత్వ నిర్ణయాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజలను మోసగించి ప్రజాధనాన్ని కొల్లగొట్టడంలో వైసిపి, టిడిపి ప్రభుత్వాలు పోటీ పడి పని చేస్తున్నాయన్నారు. సిపిఎం కార్యకర్తలు గిడ్డయ్య, మద్దిలేటి, బజారి, రవి పాల్గొన్నారు. అలాగే నగరంలోని 45వ వార్డు అజీముద్దీన్ నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ స్టిక్కర్లు అతికిస్తూ ప్రచారం నిర్వహించారు. సిపిఎం నాయకులు జెఎండి.ఉస్మాన్ బాషా, ఎస్.మక్బుల్, ఎస్.చిన్నబాషా, ఎస్‌కె.గాజుల బాషా, అక్బర్ పాల్గొన్నారు. **కర్నూలు (హాస్పిటల్)** నగరంలోని 33వ వార్డు కల్లూరులో సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుధాకరప్ప, కల్లూరు కార్యదర్శి జె.శ్రీనివాసులు, జైపాల్, ఐ.రాజు, వెంకటేష్, రాజు, లక్ష్మన్న, చిన్న మధు, శ్రీను, రాజు, ప్రభుదాసు, సుధాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి బాటలు వేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని బురాన్ దొడ్డిలో అభివృద్ధికి క్షేత్రస్థాయిలో బాటలు వేస్తామని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. స్థానిక నాయకులు రామ్ మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్రశేఖర్, శరత్, సర్పంచి రామాంజినేయులు తదితరుల సమక్షంలో ఆయన శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీసీ రోడ్ల వీధులను, డ్రైనేజీ లేని వాడలను, సంక్షేమ పథకాలు అందని వారి జాబితాను పరిశీలించారు. అలాగే ప్రజలను, బాధితులను సమస్యలను అడిగితెలుసుకున్నారు. తల్లికి వందనం నిరుపేద విద్యార్థుల కుటుంబాలకు వరమన్నారు. అలాగే ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు రైతులకు సుఖీభవ పథకం అందుబాటులోకి వస్తుందన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

తెలుగు భాషను కాపాడుకుందాం

- సంస్కృతి, సాంప్రదాయాలను భావితరానికి అందిద్దాం
- నల్గొండ జిల్లా విశ్రాంత ఐఎఎస్ అధికారి ముక్తేశ్వరరావు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

తెలుగు భాషను కాపాడుకుందామని, మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించే విధంగా కలిసికట్టుగా కృషి చేద్దామని నల్గొండ జిల్లా విశ్రాంత ఐఎఎస్ అధికారి ముక్తేశ్వరరావు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు శనివారం స్థానిక సి.క్యాంప్‌లోని టీజీవి కళాక్షేత్రంలో ఎపి రాష్ట్ర స్థాయి తెలుగు భాష పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సదస్సుకు కెసి కల్కూర అధ్యక్షత వహించారు. ముందుగా సమావేశ కర్త కోశాధికారి పత్తి ఓబులయ్య సారధ్యంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన తెలుగు భాషాభిమానులు కొండారెడ్డి బురుజు వద్ద గల తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల అలంకరించి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ మీదుగా టీజీవి కళాక్షేత్రం చేరుకున్నారు. సదస్సు ప్రారంభానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా కరిముల్లా బృందం, చిన్నారులు, ప్రార్థన నృత్య గీతాలను ఆలపించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ముక్తేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష గత వైభవం గురించి మాట్లాడడం లేదని, తెలుగు భాషకు జరుగు అపచారం గురించి ఆలోచించి మనం తీసుకోవాల్సిన చర్యలను చర్చించాలన్నారు. తెలుగు భాష కనుమరుగవుతుందని చెప్పారు. తెలుగు భాష అభిమానులు మేలుకొనకపోతే భవిష్యత్తులో మాట్లాడే వారే ఉండరన్నారు. ప్రస్తుతం జీవోలన్నీ ఆంగ్లంలోనే ఉన్నాయని, అధికార భాష ద్వారా అందరికీ అర్థమయ్యే రీతిలో ఉండాలన్నారు. పురోహితంలో సైతం ఆంగ్లం వచ్చేసిందని తెలిపారు. తెలుగు భాషకు ప్రమాదం పొంచి ఉందని దాని గురించి చర్చించి తెలియజేసే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ కాదు ఆంగ్ల ప్రదేశ్‌గా మారనుందని, అందరం చర్చించి మంచి సూచనలు, సలహాలు ఇచ్చి తెలుగు భాషను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ధర్మ ప్రచార సమితి నాయకులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ టీజీవి కళాక్షేత్రం సాంస్కృతిక కార్యక్రమాలకు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలతో కళకళలాడుతూ ఉండాలని, టీజీ వెంకటేష్ అందుకు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారన్నారు. తెలుగు భాష ఉద్యమ నాయకులు జెఎస్ఆర్కే శర్మ తెలుగు దుస్థితి గురించి వివరించారు. తెలుగు భాషాభిమాని సుబ్బ లక్ష్మమ్మ మాట్లాడుతూ తెలుగు అన్ని భాషలకు వేరు వంటిదని, భావవ్యక్తీకరణ, సత్సంగత్వం వల్ల తెలుగు విలసిల్లుతుందని చెప్పారు. తూమాటి సంజీవరావు మాట్లాడుతూ 2014 మార్చి 14న రాష్ట్రం విడిపోతుందని భావించి ముక్తేశ్వరరావు ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని 108 న్యాయశాలలలో సంచికలు విడుదల చేశారన్నారు. విశాఖపట్నం పురావస్తు ఫణిశయనసూరి పి.కన్నయ్య మాట్లాడుతూ భాష నడిస్తే జాతి నడుస్తుందని, 56 అక్షరాల భాష నేడు మాతృభాషగా ఉందన్నారు. ఎపిఎస్‌పి బెటాలియన్ డిఎస్పి మహబూబ్ బాషా మాట్లాడుతూ నేడు నిర్వహించిన ర్యాలీలో తెలుగు ఉపాధ్యాయులు 30 మంది మాత్రమే ఉండడం శోచనీయమన్నారు. తెలుగు భాషను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజానాట్యమండలి కళాకారిణి ఆర్ఎ సుజాత పాడనా తెలుగు పాట అనే గేయాన్ని ఆలపించగా, సుబ్బరాయుడు డప్పు వాయిద్య సహకారాన్ని అందించగా చప్పట్లు, ఈలలతో ఉత్సాహపరిచారు.


ర్యాలీగా వస్తున్న నాయకులు, తెలుగు ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న చంద్రశేఖర్ కల్కూర


మాట్లాడుతున్న నాయకులు

ప్రజా కళాకారుల పాత్ర గణనీయమైంది

- పిఎన్ఎం జిల్లా సలహాదారులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రస్తుతం అవినీతి, ఛాందస, మతమౌఢ్యం వైపు సమాజం పరుగులు పెడుతున్న తరుణంలో.. ప్రచార సాధనాలు ప్రభుత్వాల భాగాలుగా ఉన్న సమయంలో ప్రజా కళాకారుల పాత్ర గణనీయమైందని ప్రజానాట్యమండలి జిల్లా సలహాదారు పిఎస్.రాధాకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక కెకె భవన్‌లోని ప్రజానాట్య మండలి కార్యాలయంలో వేణమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రజానాట్యమండలి జెండాను జిల్లా అధ్యక్షులు ఎంపి.బసవరాజు ఆవిష్కరించారు. ఎం.లోకేష్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి అమర కళాకారులకు జోహార్లు తెలియజేశారు. రాధాకృష్ణ మాట్లాడుతూ... కళాకారులు బాధ్యతతో కూడిన పాత్రను పోషించి ఆ వైపు కృషి చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఈ.రాజు మూడేళ్ల నివేదికను ప్రవేశపెట్టారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'దేశభక్తిని చాటుదాం' పేరుతో జిల్లాలో 50 పాఠశాలల్లో దేశభక్తి గీతాలు, నృత్యాలు నేర్పించాలని తీర్మానించారు. ఎం.లోకేష్, బాలు, సుబ్బరాయుడు, కన్నా, లక్ష్మీనారాయణ, ఆర్ఎ.సుజాత, సరిత, లక్ష్మి, కిట్టు, ఖాసీం, రమేష్, నాగ సుంకన్న పాల్గొన్నారు. రాంబాబు వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

పాత పద్ధతిలోనే ఎఫ్‌సి ప్రాసెసింగ్ కొనసాగించాలి


- ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్

ప్రజాశక్తి - పత్తికొండ



మాట్లాడుతున్న ప్రభాకర్

ఆర్‌టిఎ కార్యాలయాల్లోనే పాత పద్ధతిలో ఫిట్‌నెస్ లైసెన్స్ ప్రాసెసింగ్ కొనసాగించాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయ ఆవరణలో ఆటోవర్కర్స్ యూనియన్ మండల మహాసభ నిర్వహించారు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ప్రభాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, మండల కార్యదర్శి డి.గోపాల్, ఎం.రవిచంద్ర హాజరై మాట్లాడారు. ఆర్‌టిఎ కార్యాలయంలో డ్రైవర్లకు సంబంధించిన లైసెన్స్, ఫిట్‌నెస్, వివిధ రకాల సేవలును అమలు చేయాలని డిమాండ్ చేశారు. పత్తికొండలో ఆర్‌టిఎ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. జిఒ 21ని రద్దు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు, వాహనదారులపై పోలీసుల వేధింపులు నివారించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా సంఘాలను కలుపుకొని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు నరసింహ (జయసింహ), చుక్కప్ప, ఆనంద్, హెచ్.వెంకటేష్, శివ నాయక్, కె.వెంకటరమణ, బి.ఆచారి పాల్గొన్నారు.



నూతన కమిటీ ఎన్నిక

జిల్లా కార్యదర్శి ప్రభాకర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మోహన్, కార్యదర్శిగా శేఖర్, ఉపాధ్యక్షులుగా ఎన్‌టిఆర్, సహాయ కార్యదర్శిగా వలీ, కోశాధికారిగా షబ్బీర్, కార్యవర్గ సభ్యులుగా కాళీ, జాకీర్, గోపాల్, చిన్న గూటం, నాయక్, తిక్క అంజిని ఎన్నుకున్నారు.

ఆటో కార్మికునికి పరామర్శ

హోసూరు గ్రామంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఎరుకల రాముడు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చక్రాళ్ల వెంకటేశ్వర రెడ్డి, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సిఐటియు మండల కార్యదర్శి డి.గోపాల్, నాయకులు ఎం.రవిచంద్ర ఆధ్వర్యంలో ఆటో కార్మికులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ... రాముడు మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, సిఐటియు ఆధ్వర్యంలో కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. వారి పిల్లల చదువుల కోసం అండగా ఉంటామని చెప్పారు. అనంతరం రాముడు భార్య మంగమ్మకు కార్మికులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



నగరంలో వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, 5వ శానిటేషన్ డివిజన్ కార్యాలయం, గడియారం ఆస్పత్రి, పాత తుంగభద్ర పంప్‌హౌస్, వాహనాల మరమ్మతుల షెడ్, గార్గేయపురం డంప్ యార్డులో బయోమైనింగ్, శునకాల సంతాన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయా పనులు ఏయే దశలో ఉన్నాయని వాటి పురోగతిపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనుల్లో జాప్యం తగదని హెచ్చరించారు. పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీటి సరఫరా మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గడియారం ఆస్పత్రి ఆధునికీకరణ పనులు, బయో మైనింగ్, శునకాల సంతాన నియంత్రణ ఆపరేషన్లు వేగవంతం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ పట్టణంలోని ఎన్టిఆర్ కాలనీలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 'స్మార్ట్ మీటర్లపై' పోరుబాట నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, పట్టణ నాయకులు రాముడు, కృష్ణ, అబ్దుల్లా మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే బిల్లులు భారీ వస్తాయని, వస్తున్నాయని తెలిపారు. ప్రజల అనుమతి లేకుండా మోసపూరిత మాటలు చెప్పి, బెదిరించి, ప్రజల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని చెప్పారు. సిపిఎం కార్యకర్తలు లక్ష్మన్న, పరమేష్, చంద్రుడు, బాష, చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, కాలప్ప, చేనేత కార్మికులు మధు, శ్రీను పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం

- నాయీ బ్రాహ్మణ స్టేట్ డైరెక్టర్ విజయకుమార్

ప్రజాశక్తి - కౌతాళం

కూటమి ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించినట్లు నాయీ బ్రాహ్మణ స్టేట్ డైరెక్టర్ పాలకవీటి విజయ కుమార్ తెలిపారు. శనివారం నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించినట్లు కౌతాళం నాయీ బ్రాహ్మణ అధ్యక్షులు శివరాజ్ తెలిపారు.


విజయకుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కేసుల సత్వర పరిష్కారానికి కృషి

- సీనియర్ న్యాయవాది ఆనంద్

ప్రజాశక్తి - ఆదోని

అవగాహన లోపం వల్ల కేసులు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్న వారు సత్వర పరిష్కారం పొందేందుకు అవకాశం ఉందని సీనియర్ న్యాయవాది ఆనంద్ తెలిపారు. ఆదోని మండల లీగల్ సర్వీస్ ఛైర్మన్ న్యాయమూర్తి సుధా ఆదేశాల మేరకు శనివారం కోర్టు ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు వీరేష్, నెట్టికంటయ్య, లోకేష్ కుమార్, రామాంజనేయులు హాజరై మాట్లాడారు. మధ్యవర్తిత్వం అంటే ఏమిటి, మధ్యవర్తిత్వం ద్వారా కేసుల వల్ల కోర్టుకు తిరిగే వారికి ఏ విధంగా మేలు చేకూరుతుందో వివరించారు. దేశంలో చాలా కేసులు పెండింగ్ ఉండడం వల్ల సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసులు త్వరగా పరిష్కరించాలని మీడియేషన్ ట్రైనింగ్ తీసుకొని, వాది, ప్రతివాదులకు మధ్యవర్తిత్వం ద్వారా కేసు ఎలా పరిష్కరించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరిస్తే కాలం, డబ్బు, వృథా కాకుండా తక్కువ సమయంలోనే కేసులు పరిష్కరించుకోవాలని, దాని ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ మీడియేషన్ మెంబర్లు, న్యాయవాదులు ఆనంద్, నెట్టకంటయ్య, వీరేష్, లోకేష్ కుమార్, రామాంజనేయులు అందుబాటులో ఉంటారని, సంప్రదించాలని సూచించారు.


అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో

ఉచిత కంటి వైద్య శిబిరం

- కంటి పరీక్షలు నిర్వహించిన డాక్టర్ హేమంత్ కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని బస్టాండ్ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మిగనూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మిగనూరు ఆర్కె కంటి వైద్యశాల డాక్టర్ హేమంత్ కుమార్ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 160 మందికి పరీక్షలు నిర్వహించి, 46 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి చుక్కల మందు, మందులు ఉచితంగా అందజేశారు. ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన వారికి ఎమ్మిగనూరులోని ఆర్కె కంటి ఆసుపత్రిలో ఈనెల 15, 16, 17, 18, 19వ తేదీల్లో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు కె.శ్రీనాథ రెడ్డి, కార్యదర్శి ఎ.సుధాకర్ రావు, ప్రోగ్రాం ఆర్గనైజర్ కెఆర్.నటరాజ రెడ్డి, ట్రెజరర్ రామాచారి, నాగరాజు, ట్రెజరర్ మాచాని నాగరాజు, సభ్యులు కేశవరెడ్డి, మాచాని వెంకటేష్, రాజు, రవి, మాచాని శివశంకర్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అభివృద్ధి పథంలో 'ఉరుకుంద'

- దాతలను అభివృద్ధి వైపు నడిపించిన డిప్యూటీ కమిషనర్ విజయ రాజు

- రూ.కోట్లలో విరాళాలు...

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీలక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం. శ్రావణ మాస ఉత్సవాలు, కార్తీక మాస ఉత్సవాలు, అమావాస్య రోజుల్లో లక్షల్లో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. భక్తుల ద్వారా రూ.కోట్ల ఆదాయం సమకూరుతున్నా భక్తులకు మాత్రం సౌకర్యాలు అంతంత మాత్రమే ఉండేవి. ప్రస్తుతం క్షేత్రం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. దేవాలయ డిప్యూటీ కమిషనర్ విజయ రాజు దాతల విరాళాలతో దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

దేవాలయం వార్షిక ఆదాయం కూడా పెరుగుతూ రావడంతో దేవదాయ శాఖ దేవస్థానానికి గతేడాది డిప్యూటీ కమిషనర్ హోదా కల్పించారు. ఈ హోదాలో మొదటి డిప్యూటీ కమిషనర్‌గా వచ్చిన వెంకటేష్ దేవాలయంలో మార్పులకు శ్రీకారం చుట్టారు. రాజకీయ ఒత్తిళ్లకు గురై ఆయన బదిలీపై వెళ్లారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ రాజు ఆలయంలో పని చేస్తున్న అర్చకులపై వస్తున్న విమర్శలను తొలగిస్తూ, నిత్యాన్నదాన సత్రంలో మార్పులు తీసుకొచ్చారు. వెంటనే స్వామి వారి భక్తులు, దాతల సహకారంతో దేవాలయ అర్చకులు, సిబ్బందితో కలిసి మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ మహా కుంభాభిషేకం నిర్వహణతో దాతలకు నమ్మకం ఏర్పడి ఆకర్షించడం, దేవాలయం ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకులు మహదేవస్వామి, పూజన్న స్వామి, ముఖ్య అర్చకులు శివన్న స్వామి, నాగరాజ్ స్వామి, ఈరన్న, మల్లయ్య తదితరులతో దాతలను గుర్తించారు. క్షేత్రంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలను దాతల దృష్టికి తీసుకెళ్లి, అభివృద్ధి పనుల్లో పాలు పంచుకునేలా చేయడంలో డిప్యూటీ కమిషనర్ విజయ రాజు సఫలీకృతులయ్యారు. ఆరు మాసాల్లో ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సమన్వయ సమావేశంలో చెప్పిన మాటలే అందుకు నిదర్శనం. అభివృద్ధి పనులను ముందుకు తీసుకుని, మరోవైపు ఆదాయం పెంచుతూ రాష్ట్రంలోనే ముఖ్యమైన 22 దేవస్థానాల స్థానంలో శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ఒకటిగా గుర్తింపు పొందింది..!


భక్తుల కోసం దారి

అభివృద్ధి కోసం రూ.కోట్లలో విరాళాలు

శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి భక్తులు రూ.కోట్లలో విరాళాలు చెల్లించి అభివృద్ధి పనుల్లో సహకారం అందజేస్తున్నారు. బెంగళూరు నగరానికి చెందిన భక్తుడు మంజునాథ మహా కుంభాభిషేకానికి గోపురాల పైనుంచి హెలిక్యాప్టర్ ద్వారా పూల వర్షానికి సుమారు రూ.12 లక్షలు ఖర్చు చేశారు. క్షేత్రంలో కోనేరు నిర్మాణానికి రూ.1.80 కోట్లు విరాళం అందజేశారు. ఈ పనులు శ్రావణమాసం అనంతరం ప్రారంభించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. శ్రీశైలం క్షేత్రంలో మాదిరిగా స్వామివారికి రూ.1.30 కోట్లతో రథం చేయడానికి మరో భక్తుడు ముందుకొచ్చారు. కర్ణాటకలోని బళ్లారి పట్టణానికి చెందిన భక్తుడు బి.తిమ్మప్ప ఉరుకుందలోని రూ.7 కోట్ల విలువచేసే ఒక ఎకరా 11 సెంట్ల భూమిని దేవాలయం పేరిట రిజిస్ట్రేషన్ చేయించి విరాళంగా అందజేశారు. రూ.2.30 కోట్లతో జీ ప్లస్ త్రీతో మూడు అంతస్తుల అన్నదాన సత్రం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు.

భక్తులకు శుద్ధ జలాలు

శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు శుద్ధ జలాలు అందించడానికి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కౌతాళం సమీపంలోని రాజనగర్ ఎస్ఎస్ ట్యాంకు ద్వారా ప్రత్యేక పైపులైన్ ఏర్పాటుచేసి దేవస్థానం సమీపంలో వాటర్ సంప్ నిర్మించి ప్రతి భక్తునికీ తాగునీరు అందించడానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల సమన్వయంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.


ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాట్లు

ప్రత్యేక దర్శన సౌకర్యాలు

శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు ప్రత్యేక దర్శన సౌకర్యాలకు దేవాలయ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా 9 వారాలు 9 ప్రదిక్షణలు భక్తులు చేసేలా పుట్ అవుట్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.1000 టికెట్లతో అంతరాలయం దర్శనం ఏర్పాట్లు చేస్తున్నారు. విఐపిల కోసం ఉత్తర ద్వారం వద్ద లాంజ్ ఏర్పాటు జరుగుతోంది. ఇవే కాకుండా భక్తులకు ఉచిత దర్శనం కూడా ఉంటుంది. దర్శనానికి వచ్చే భక్తులు ఎండకు, వానకు ఇబ్బంది పడకుండా ఆలయం అంతర్భాగంలోని నలువైపులా రూ.6 లక్షలతో షెడ్లను ఏర్పాటు చేశారు. దేవాలయం చుట్టూ సిమెంట్ ఫెవర్ బ్రిక్స్‌తో పాటు ప్రహరీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. దేవదాయ శాఖ, దాతల సహకారంతో ఉరుకుంద క్షేత్రం ఎంతో అభివృద్ధి చెందుతోంది.

సరైన వసతి లేక కూలి పనులకు

- కెజిబివిలో సీటు కేటాయించాలి

- విద్యార్థినుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - హోళగుంద

పాఠశాలకు వెళ్లి చదువుకోవడానికి సరయిన వసతి లేక విద్యార్థినులు కూలి పనులకు వెళుతున్నారు. తాము చదువుకోవడానికి కెజిబివిలో సీటు కేటాయించాలని కోరుతున్నారు. మండలంలోని లింగదహళ్లి గ్రామానికి చెందిన హరిజన హులిగప్ప, లక్ష్మిల కుమార్తె సరస్వతి, ఎం.రాముడు, లక్ష్మిల కుమార్తె పార్వతి లింగదహళ్లి గ్రామం ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్నారు. 6వ తరగతి చదివేందుకు కెజిబివిలో సీటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సీటు రాకపోవడంతో ఎస్సీ కులానికి చెందిన వలస కూలీలైన వీరి తల్లిదండ్రులు 6వ తరగతి కోసం హెబ్బటం లేదా హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించలేక ఇంటి దగ్గరే ఉంచుకున్నారు. రోజూ గ్రామం నుంచి పంపించడానికి సరైన వసతి లేక ఏ పాఠశాలలోనూ చేర్పించక ఇంటి వద్దనే ఉంచుకొని కూలీ పనులకు పంపిస్తున్నారు. తాము వలస పోతే పిల్లలను వెంట తీసుకెళ్తామని, ఇక్కడ ఒంటరిగా వదిలి వెళ్లలేమని తల్లిదండ్రులు చెబుతున్నారు. తమకు చదువుకోవాలని ఉందని, తమ తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించకపోవడంతో కూలీ పనులకు పోతున్నామని విద్యార్థినులు తెలిపారు. అధికారులు సహాయం చేసి కెజిబివిలో సీటు ఇప్పిస్తే హాస్టల్‌లో ఉండి చదువుకుంటామని కోరారు.




రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. శనివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన సమయంలో ఎలాంటి తోపులాట, తొక్కిసలాట జరగకుండా శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు నిలబడి ప్రత్యేక చర్యలు చేపట్టారు. శ్రీమఠం ప్రధాన ముఖద్వారం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి క్యూలైన్ పద్ధతిలో సిబ్బంది, సెక్యూరిటీ సహకారంతో శ్రీమఠం ప్రాకారంలోకి క్రమ పద్ధతిలో పంపించారు. పరిమళ ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా క్యూలైన్‌లో పంపిస్తూ సేవలందించారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు

హైకోర్టు జడ్జిని కలిసిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - మంత్రాలయం

హైకోర్టు జడ్జి వెంకట జ్యోతిర్మయిని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై శుక్రవారం రాత్రి మంత్రాలయం చేరుకున్న ఆమె కుటుంబ సభ్యులతో గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. శనివారం ఉదయం శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీపద్మనాభ తీర్థ అతిథి గృహంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సబ్ కలెక్టర్

సుపరిపాలనతో సమస్యలు పరిష్కారం

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు'తో సమస్యలను పరిష్కరిస్తామని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని మాచాపురం, ఈదుల దేవరబండ, కరివేముల గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. టిడిపి నాయకులు ఈదుల దేవరబండ సుభాన్, బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్, సిద్ధ, బడేసా, వీరేష్, నాగేశ్వరరావు, రుద్ర, మహేష్, సతీష్, సుధాకర్, నగేష్, చిన్న రాముడు, మస్తాన్, చాంద్ బాషా పాల్గొన్నారు. **కోసిగి** మండలం సజ్జలగూడెం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు జ్ఞానేష్ అధ్యక్షతన 'సుపరిపాలనలో తొలిఅడుగు' నిర్వహించారు. టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, చింతలగేని నర్సారెడ్డి, వక్రాని వెంకటేష్, హోళగుంద కోసిగయ్య, మల్లికార్జున, భీమేష్, నరసింహులు, హనుమంతు, నరసింహులు పాల్గొన్నారు.


దేవనకొండలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వీరభద్ర గౌడ్


కోసిగిలో కరపత్రాలను పంచుతున్న రాఘవేంద్ర రెడ్డి

స్మార్ట్ మీటర్లపై మాట మార్చిన 'కూటమి' : సిపిఎం

ప్రజాశక్తి -ఆలూరు

ప్రజాధనాన్ని అదానికి దోచి పెట్టేందుకే కూటమి ప్రభుత్వం మాట మార్చి స్మార్ట్ మీటర్లు పెడుతోందని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు విమర్శించారు. శనివారం మండలంలోని మనేకుర్తి, అగ్రహారం గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లపై పోరుబాట నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు కరపత్రాలు పంచారు. పి.హనుమంతు, కెపి.నారాయణ స్వామి మాట్లాడుతూ... పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, అదానీ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న ఆలూరు విద్యుత్ కార్యాలయంలో జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు కృష్ణ, విఠల్ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని కల్లుబావి వీధిలో పత్రాలు పంచారు. సిపిఎం పట్టణ కమిటీ నాయకులు నాగరాజు, ముక్కన్న మాట్లాడుతూ... ఈనెల 14న ఆదోని విద్యుత్ భవనం ముందు చేపట్టే ధర్నాలో పాల్గొనాలని కోరారు. **కౌతాళం** మండలం బదినేహళ్, కుంటనహాలు, ఉప్పర హాలు, రౌడూరు గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. 14న స్థానిక విద్యుత్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఈరన్న, మండల నాయకులు ఉల్లిగయ్య కోరారు.


మనేకుర్తిలో స్మార్ట్ మీటర్లపై ప్రజలకు వివరిస్తున్న నాయకులు

విఓఎ చేతివాటం..!

- శ్రీనిధి వాయిదాల చెల్లింపులో గోలమాల్

- లబోదిబోమంటున్న పొదుపు సభ్యులు

- ఏం రాసుకుంటారో రాసుకోండి - విలేకరులపై ఐకెపి ఎపిఎం దుర్భాషలు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద గ్రామంలోని 'పారిజాతం' పొదుపు గ్రూపునకు చెందిన సభ్యుల నుంచి స్థానిక వెలుగు కార్యాలయంలో రికవరీ చేసే ఓ విఒఎ మహిళా యానిమేటర్ శ్రీనిధి వాయిదాల చెల్లింపులో చేతివాటం ప్రదర్శించారు. వాయిదాల గడువు తీరినా, అదనపు డబ్బులు తీసుకుని నకిలీ బిల్లు ఇచ్చి మోసం చేసినట్లు పొదుపు గ్రూపు సభ్యులు వాపోతున్నారు.

2023లో 'పారిజాతం' పొదుపు గ్రూపు సభ్యులకు శ్రీనిధి కింద రూ.2 లక్షల రుణాలు మంజూరు చేశారు. నలుగురు రూ.50 వేల చొప్పున రుణాలు తీసుకున్నారు. చంద్రమ్మ, వడ్డే పార్వతితో పాటు మరో ఇద్దరు 18 వాయిదాలతో 2025 జూన్ వరకు చెల్లించారు. ఆ విఒఎ గత మేనెల వరకు బ్యాంకు ద్వారా వచ్చే డిజిటల్ బిల్లులు గ్రూపు సభ్యులకు ఇచ్చి, జూన్ నెలకు సంబంధించిన బ్యాంకు చెల్లింపుల బిల్లు మాత్రం మాన్యువల్ బిల్లు ఇచ్చారు. అనుమానం వచ్చి విచారించగా అదనంగా ఓ వాయిదా బిల్లు రూ.12 వేలు స్వాహా చేసినట్లు తెలియడంతో, విఒఎతో వాగ్వాదానికి దిగారు. డబ్బులు ఇవ్వాలని, ఆ విఒఎపై చర్యలు తీసుకోవాలని ఎపిఎం సూర్య ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు.


విలేకర్లతో వాగ్వాదానికి దిగిన ఎపిఎం

విఒఎగా భార్య, భర్తను ఎలా కొనసాగిస్తారు

హోళగుందకు చెందిన భార్యభర్తలు సునీత, నాగరాజు స్వామిని విఒఎలుగా వెలుగు కార్యాలయంలో ఎలా కొనసాగిస్తారని, ఉద్యోగం కల్పించడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఐకెపి కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య తీర్మానాల ప్రకారం ఏదైనా జరగాల్సి ఉంటుంది. మండల మహిళా సమాఖ్య లీడర్లు నిరక్షరాస్యులు కావడం, కార్యాలయాల విధివిధానాల పట్ల అవగాహన లేక పోవడంతో గతంలో ఇక్కడ పనిచేసిన ఎపి నవీన్ కుమార్, ప్రస్తుత ఎపిఎం సూర్యప్రకాష్‌లు వారి అవినీతిని ప్రశ్నించిన విఒఎలను అడ్డగోలుగా తొలగించడం, అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారు.

విలేకరులపై ఎపిఎం చిందులు

పొదుపు సభ్యుల వాయిదాల చెలింపులో జరిగిన అవినీతిపై వివరణ కోరేందుకు వెళ్లిన విలేకరులపై ఐకెపి ఎపిఎం సూర్య ప్రకాష్ చిందులు తొక్కారు. అవినీతి జరిగిన విషయం తనకు తెలుసని, అన్యాయం జరిగిన వారు లిఖితపూర్వకంగా ఇవ్వకుంటే చర్యలు తీసుకోనని తెలిపారు. ఒకవేళ సాక్ష్యాలు తీసుకొని, రాతపూర్వకంగా ఇస్తే చర్యలు తీసుకుంటానని, లేకపోతే పేపర్లలో ఏం రాసుకుంటారో రాసుకోండని, మీలాంటి విలేకరులను ఎంతోమందిని చూశానని, భయపడనంటూ చిందులు తొక్కారు. ఎపిఎంపై చర్యలు తీసుకోవాలని ఎపియుడబ్ల్యుజె అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎపిఎం సూర్య ప్రకాష్‌ను వివరణ కోరగా.. 'ఏదో ధ్యాసలో తెలియక అన్నాను. మీరు కుడా చూసీచూడనట్లు పోవాల'ంటూ తెలిపారు.

బస్సు సర్వీసు నడపాలి : సిపిఎం

రాత్రి 8 గంటలకు గుంతకల్ నుంచి ఆలూరుకు

ప్రజాశక్తి - చిప్పగిరి

రోజూ రాత్రి 8 గంటలకు గుంతకల్ పట్టణం నుంచి ఆలూరుకు బస్సు సర్వీసు నడపాలని సిపిఎం జిల్లా నాయకులు పి.హనుమంతు, మండల నాయకులు విఠల్, ఉప్పర గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం గుంతకల్ డిపో మేనేజర్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిత్యం గుంతకల్ నుంచి చిప్పగిరి మీదుగా ఆలూరుకు వెళ్లాలంటే సాయంత్రం 6 గంటల నుంచి బస్సు లేక ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆటో వారు చెప్పిన ధరకు చెల్లించి గమ్యాన్ని చేరుకోవాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. ప్రయాణికులు తక్కువగా ఉంటే ఆటోలు కూడా వచ్చే పరిస్థితి లేదని, గుంతకల్ నుంచి చిప్పగిరి మీదుగా ఆలూరుకు వెళ్లాలంటే ప్రజలు అవస్థలు ఎదుర్కోలేక ప్రయాణాన్ని కూడా వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి ఉందని తెలిపారు. 2020 కరోనా సమయం నుంచి గతంలో ఉన్న బస్సు సర్వీసును రద్దు చేసి ఈ ప్రాంత ప్రయాణికులు అవస్థలు పడే విధంగా చేశారని, ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని బస్సు సర్వీసు నడపాలని సిపిఎంగా విన్నవించినా డిపో మేనేజర్ పెడచెవిన పెడుతున్నారని చెప్పారు. చిప్పగిరి, ఆలూరు మండల ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాత్రి 8 గంటలకు బస్సు సర్వీసు నడపాలని కోరారు. లేకపోతే చిప్పగిరి, ఆలూరు మండల ప్రజలను సమీకరించి గుంతకల్ డిపో మేనేజర్ కార్యాలయం ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఖాజా పాషా, జిల్లా నాయకులు మూస డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పెద్ద పార్కులో ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సమావేశం మహ్మద్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు పనికి తగిన వేతనం లేక, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, నిధులు కేటాయించి, బిల్డింగ్ వర్కర్లను ఆదుకోవాలని కోరారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోతే ఆగస్టులో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కన్వీనింగ్ కమిటీ కన్వీనర్‌గా మహ్మద్ హుస్సేన్, కో కన్వీనర్‌గా విజయ్ కుమార్‌తో పాటు 11 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖాజా హుస్సేన్, ఇస్మాయిల్, నాగరాజు, ఖాదర్ వలీ, బీరప్ప, ఈరన్న, టైగర్ ఖాజా, వెంకట్ రాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖాజా పాషా

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు తగవు : టిడిపి

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మెల్యే బీవీపై అసత్య ప్రచారాలు చేయడం తగదని టిడిపి మండల నాయకులు విమర్శించారు. శనివారం నందవరం గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ముగతి ఈరన్న గౌడ్, మాధవరావు దేశాయ్, ఖాసీం వలీ, ధర్మపురం గోపాల్, మిల్లు నారాయణరెడ్డి, చిన్న రాముడు మాట్లాడారు. నియోజకవర్గంలోని రైతులకు యూరియాను అందించేందుకు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి కృషి చేయడం లేదని కొంతమంది మాట్లాడడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకూ యూరియా అందిస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో కూడా రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా అందేలా కృషి చేస్తామని చెప్పారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

టిడిపి కార్యకర్త మురళీ కుటుంబాన్ని టిడిపి నాయకులు పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం మురళీ కుమారునికి గుండె ఆపరేషన్ చేశారు. బాలుని ఆరోగ్య పరిస్థితి గురించి నాయకులు అడిగి తెలుసుకున్నారు. పిల్లవాడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఏమీ చేయలేని పరిస్థితిలో తమ కుటుంబం నిరాశకు గురైందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే బీవీ, మంత్రాలయం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు సహాయ, సహకారాలతో అబ్బాయి గుండె ఆపరేషన్ విజయవంతమయిందని చెప్పారు. ఎమ్మెల్యేకు, పీఠాధిపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబాన్ని పరామర్శించిన టిడిపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మానందరెడ్డి, జనసేన ఎల్లప్ప, భార్గవ్ యాదవ్, హాలహర్వి ఎర్రం నాయుడు, గ్రామ అధ్యక్షుల భీమశేఖర్, శేషాద్రి, కైరవాడి వీరేష్, తెలుగు ఈరన్న, కడబూరి, చాకలి పంపయ్య, నజీర్, చాంద్ బాషా, సెక్రటరీ సుదర్శనం, సొసైటీ సిబ్బంది వీరేష్, ప్రతాప్, వేణుగోపాలరావు పాల్గొన్నారు.


యూరియాను పంపిణీ చేస్తున్న నాయకులు

క్రీడలతో ఆరోగ్యం పదిలం

- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ఆటలు ఎంత బాగా ఆడితే అంత మంచి ఆరోగ్యాన్ని సంపాదించుకున్న వారమవుతామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. శనివారం ఆదోని మున్సిపల్ మైదానంలో సౌత్ ఇండియా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి శని, ఆదివారాలు మైదానం నిండా చేరి ఆటలు ఆడుకోవాలని తెలిపారు. ఆటలు ఆడడం ద్వారా మాత్రమే ఆరోగ్యం కాపాడుకోగలమని చెప్పారు. క్రీడల వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయని తెలిపారు. ఆటలు ఆడడానికి ఆదోనికి విచ్చేసి అతిథులందరికీ స్వాగతం పలికి, ఆదోనికి మరికొన్ని ఊళ్ల నుంచి కూడా ఆటలు ఆడుకోవడానికి రావాలన్నారు. క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించేందుకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ఆదోని క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ముజీబ్ అహ్మద్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు ఉన్నారు.


బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

జాబ్ మేళాను వినియోగించుకోండి

ఈనెల 17న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాయి డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. శనివారం జాబ్ మేళా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 10 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసీ చదువుకొని 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువత అర్హులని చెప్పారు. ఉదయం 9.30 నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో వివరాలను నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరు కావాలని కోరారు.